సాక్షి
నిర్మల్
ఆదివారం । 14 । ఏప్రిల్ । 2024



ఉద్యోగులూ.. బహుపరాక్..!
పార్లమెంటు ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యం లో ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాల్సిన సమయమిది. 8లో▸



చెరువు మట్టితో చేనుకు మేలు
రైతులు రసాయన ఎరువుల వాడకాన్ని అధికం చేశారు. రసాయన ఎరువులకన్నా చెరువు మట్టితో ఎంతో మేలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
38.4 /26.3

వాతావరణం
ఆకాశం నిర్మలంగా, చాలావరకు ఎండగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. వేడి, ఉక్కపోత పెరుగుతుంది.



కుంటాల మండలం కల్లూర్‌లో నేలవాలిన జొన్న చేను



లోకేశ్వరంలో ప్రధాన రోడ్డుపై ఆరబోసిన మక్కలు

అకాల నష్టం!

- జిల్లాలో వడగండ్ల వాన
- తడిసిన మొక్కజొన్న, వరి ధాన్యం కుప్పలు
- కాపాడుకునేందుకు రైతుల తంటాలు
- మరో రెండు రోజులు వర్షాలు కురిసే అవకాశం

అకాల వర్షాలు జిల్లా రైతులకు నష్టం కలిగిస్తున్నాయి. భైంసా, ముధోల్, కుభీర్, తానూరు, సర్సాపూర్(జి), బాసర, లోకేశ్వరం, కుంటాల, దిలావర్‌పూర్ మండలాల్లో శుక్రవారం రాత్రి, శనివారం ఉదయం వడగండ్ల వాన కురిసింది. అకాల వర్షానికి రైతులు ఇబ్బంది పడ్డారు. మరో రెండు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రకటించడంతో రైతులు మరింత గాబరాపడుతున్నారు. అకాల వర్షానికి కల్లాల్లో ఆరబోసిన మొక్కజొన్న, వరి ధాన్యం తడిసింది. తడవకుండా కాపాడుకునేందుకు రైతులు తిప్పలు పడ్డారు. మరో రెండు రోజులు వర్షాలు కురిస్తే మొక్కజొన్నలు మొలకలు వస్తాయని, కంకులు నల్లబడతాయని రైతులు పేర్కొంటున్నారు. ధాన్యం కూడా రంగు మారుతుందని ఆందోళన చెందుతున్నారు. కుంటాల మండలం కల్లూర్, అంబకంటి, ఓలా, దౌనెల్లి, లింబా(కె), కుంటాల గ్రామాల్లో శుక్రవారం అర్ధరాత్రి వర్షం కురిసింది. దీంతో జొన్న పంట నేలవాలింది. కల్లాల్లో పంట తడవకుండా రైతులు టార్పాలిన్లు కప్పి ఉంచారు. తెంపాల్సిన మిర్చి నేలరాలింది. లోకేశ్వరం మండలం జోహర్‌పూర్, అబ్దుల్లాపూర్, రాయపూర్‌కాండ్లీ, ధర్మోరా, పంచగుడి, పిప్రి, వట్టోలి, సాథ్‌గాం, సేవాలాల్‌తండా, అర్లిగొడిసెరా, గడ్‌చాంద తదితర గ్రామాల్లో శుక్రవారం రాత్రి, శనివారం ఉదయం ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. దీంతో వరి, మొక్కజొన్న, నువ్వు పంటలు నేలవాలాయి. ఆరుగాలం శ్రమించి సాగుచేసిన పంటలు చేతికి వచ్చే సమయంలో దెబ్బతినడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కల్లాల్లో పోసిన మొక్కజొన్న, వరి ధాన్యం కాపాడుకునేందుకు రైతులు ఇబ్బందులు పడ్డారు.

- భైంసా/కుంటాల/లోకేశ్వరం



లోకేశ్వరంలో తడిసిన ధాన్యం ఆరబెడుతున్న రైతులు



అబ్దుల్లాపూర్‌లో ధాన్యంపై టార్పాలిన్ కప్పుతున్న మహిళా రైతు



కుంటాల: అందకూర్‌లో మొక్కజొన్న రాసులు తడవకుండా కప్పి ఉంచిన టార్పాలిన్‌లు

అందరి దృష్టి ఆదిలాబాద్‌పైనే..



అభివాదం చేస్తున్న బీజేపీ జాతీయ నేత మురళీధర్‌రావు, ఎమ్మెల్యేలు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, పాయల్ శంకర్, హరీశ్‌బాబు, రామారావుపటేల్ తదితరులు

- ఎంపీ సీటును గెలిపించి మోదీకి బహుమానంగా ఇద్దాం
- బీజేపీ ఎమ్మెల్యేలు ఏలేటి, పాయల్, హరీశ్‌బాబు, రామారావుపటేల్

ఆదిలాబాద్‌రూరల్: రాష్ట్రంలో బీజేపీ ఎమ్మెల్యేలు ఎనిమిది మంది ఉండగా.. అందులో ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలోనే నలుగురు ఉన్నారని, ప్రస్తుతం రాష్ట్ర ప్రజల దృష్టి అంతా ఆదిలాబాద్ ఎంపీ స్థానంపైనే ఉందని బీజేపీ ఎమ్మెల్యేలు మహేశ్వర్‌రెడ్డి, పాయల్ శంకర్, హరీశ్‌బాబు, రామారావు పటేల్ అన్నారు. పార్టీ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించి ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి బహుమానంగా ఇద్దామని అన్నారు. ఆదిలాబాద్ పట్టణ శివారులోని ఓ గార్డెన్‌లో బీజేపీ బూత్ స్థాయి కార్యకర్తల విజయ సంకల్ప సమ్మేళనం శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి పార్టీ జాతీయ నేత మురళీధర్‌రావు ముఖ్యఅతిథిగా హాజరై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. నిర్మల్ ఎమ్మెల్యే, ఎల్‌పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డికి అవినీతి, అక్రమాలు, భూకబ్జాలపై ఉన్న శ్రద్ధ ప్రజల సంక్షేమం, అభివృద్ధిపై లేదని విమర్శించారు. సీఎం చేస్తున్న అక్రమాలపై ఆధారాలతో నిరూపించేందుకు సిద్ధంగా ఉన్నానని సవాల్ విసిరినా ఆయన నుంచి ఎలాంటి స్పందన లేదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఈ ఎన్నికల్లో వారు చెబుతున్నట్లుగా 14 ఎంపీ స్థానాల్లో గెలిస్తే తాను శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకుంటానని పేర్కొన్నారు. ఒకవేళ వారు అనుకున్నంత స్థానాల్లో గెలువకపోతే సీఎం రేవంత్ రెడ్డి రాజకీయాల నుంచి తప్పుకుంటారా అని సవాల్ విసిరారు. ఎలాంటి అవినీతి, అక్రమాలు లేకుండా పాలన సాగిస్తున్న నరేంద్ర మోదీని మరోసారి ప్రధానిగా చేసేందుకు దేశ ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ.. బూత్‌స్థాయిలో కార్యకర్తలు సమష్టిగా కృషి చేస్తూ పార్టీ అభ్యర్థి గెలుపుకోసం కృషి చేయాలన్నారు. సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు మాట్లాడుతూ.. ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డిని ఆ పదవి నుంచి దించాల్సిన అవసరం బీజేపీకి లేదని, కాంగ్రెస్‌కు చెందిన ఖమ్మం, నల్లగొండ బ్యాచే ఆయనను సీఎం పదవి నుంచి దించుతారని పేర్కొన్నారు. ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ మాట్లాడుతూ.. మరోసారి నరేంద్ర మోదీ ప్రధానమంత్రి కావడానికి కార్యకర్తలంతా కృషి చేయాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలపై చేస్తున్న మోసాలను ఇంటింటికీ వెళ్లి వివరించాలన్నారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్ మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిగా తనను అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ పార్లమెంట్ ఆర్గనైజర్ అల్జపూర్ శ్రీనివాస్, జెడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్, పార్టీ జిల్లా అధ్యక్షులు బ్రహ్మానందం, అయ్యన్నగారి భూమయ్య, అంజుకుమార్, డాక్టర్ శ్రీనివాస్, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి, ఆదినాథ్, నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు

ఖానాపూర్: ఖానాపూర్ పట్టణ పరిధిలో అక్రమంగా నిర్మాణాలు చేసినా, వెంచర్లు వేసినా చర్యలు తప్పవని మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం హెచ్చరించారు. పట్టణంలో శనివారం మాట్లాడారు. పట్టణంలో అనుమతులు లేకుండా వెంచర్లను ఏర్పాటు చేయడం నిబంధనలకు విరుద్ధమన్నారు. ఇళ్ల నిర్మాణాలు, షాపింగ్ కాంప్లెక్స్‌లు నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. మున్సిపాలిటీలో లోటు బడ్జెట్ కారణంగానే మున్సిపల్ కమిషనర్ మనోహర్ అక్రమ నిర్మాణాలు, వెంచర్లపై కొరడా ఝళిపిస్తున్నారని పేర్కొన్నారు. దీనిపై కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని తెలిపారు. దుష్ప్రచారం చేసేవారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు.

న్యూస్‌రీల్


కనీస వేతనం అమలు చేయాలి



మాట్లాడుతున్న బొమ్మెన సురేశ్

నిర్మల్‌చైన్‌గేట్: ఆశ వర్కర్లకు పారితోషకం కాకుండా కనీస వేతనం అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బొమ్మెన సురేశ్ కోరారు. జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఆశ వర్కర్లపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివక్ష వీడాలన్నారు. మార్చి నెల పారితోషకం ఇప్పటి వరకు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న పారితోషకం, పల్స్ పోలియో, కంటి వెలుగు, ఎండీఏ సర్వే అమౌంట్ చెల్లించాలన్నారు. అధికారుల వేధింపులు ఆపి పారితోషకం ఇచ్చే పనులు మాత్రమే చేయించాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తమ బతుకులు మారుస్తుందన్న ఆశతో ఆశ వర్కర్లు ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షురాలు సుజాత, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.గంగమణి, లక్ష్మి పోశెట్టి, జావర పోశెట్టి పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాల ఏర్పాటు



స్తంభాలను పరిశీలిస్తున్నఅధికారులు..

సోన్ : జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ జయవంత్ రావు చౌహాన్ ఆదేశాల మేరకు గోదావరి నది పాత వంతెనపై సోన్ 33 కేవీ ఫీడర్‌కు సంబంధించిన ఇనుప విద్యుత్ స్తంభాలు, కొత్త కండక్టర్ శనివారం ఏర్పాటు చేసినట్లు ఏఈ శ్రీనివాస్ తెలిపారు. మిడిల్ స్తంభాలు 60 ఏళ్ల వరకు చెడిపోకుండా ఉంటాయని చెప్పారు. ఇందులో డీఈ నాగరాజు, ఏడీ రవి, గుత్తేదారు మహ్మద్‌సర్దార్ తదితరులు పాల్గొన్నారు.

కారులో మరో 'చైర్' ఖాళీ

- బీఆర్‌ఎస్‌ను వీడిన మున్సిపల్ చైర్మన్
- ఆయన వెంట పలువురు కౌన్సిలర్లు
- 'అల్లోల' చేరికపై వీడని సందిగ్ధం

నిర్మల్: పార్లమెంట్ ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ జిల్లాలో రాజకీయం వేగంగా మారుతోంది. ప్రధానంగా భారత రాష్ట్ర సమితి పునాదుల నుంచి బీటలు వారుతోంది. కారు పార్టీలో మరో అధికార చైర్ ఖాళీ కానుంది. నిర్మల్ మున్సిపల్ చైర్మన్ బీఆర్‌ఎస్ పార్టీకి శనివారం రాజీనామా చేశారు. ఆయన సోమవారం లేదా మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్లు ప్రకటించారు. ఈశ్వర్ వెంట పలువురు కౌన్సిలర్లు సైతం గులాబీ పార్టీని వీడి హస్తం గూటికి చేరనున్నారు. మరోవైపు అనుచరులంతా కారును వీడి కాంగ్రెస్ పార్టీలో చేరుతుంటే మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి చేరికపై మాత్రం సందిగ్ధత కొనసాగుతూనే ఉంది.

ఒంటరవుతున్న 'అల్లోల'

నిర్మల్ నియోజకవర్గంలో బీజేపీ గెలిచినప్పటికీ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు పెరుగుతున్నాయి. ఓడిపోయిన గులాబీ పార్టీ నుంచి భారీగా హస్తం గూటికి వలసలు వెళ్తున్నాయి. పదేళ్లు మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి చుట్టూ ఉన్నవారంతా పార్టీని వీడుతున్నారు. ఇప్పటికే గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ ఎర్రవోతు రాజేందర్, నిర్మల్ మున్సిపల్ మాజీ చైర్మన్ అప్పాల గణేశ్‌చక్రవర్తి, నిర్మల్ ఎంపీపీ కొరిపల్లి రామేశ్వర్‌రెడ్డి, నిర్మల్ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక రమణ, బంగల్‌పేట్ మహాలక్ష్మి ఆలయ చైర్మన్ కొడుకుల గంగాధర్ తదితరులు అల్లోలను వీడి డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. తాజాగా మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, సీనియర్ కౌన్సిలర్లు సైతం కాంగ్రెస్ పార్టీలో చేరబోతున్నారు. మాజీ మంత్రి మరో ప్రధాన అనుచరులుగా ఉన్న జెడ్పీ చైర్మన్ విజయలక్ష్మి, ఆమె భర్త రాంకిషన్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు మారుగొండ రాము మాత్రమే మిగిలారు.

పట్టు పెంచుతున్న కూచాడి...

నిర్మల్ రాజకీయాల్లో డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు క్రమంగా పట్టు పెంచుతున్నారు. తాను ఎన్నికల్లో ఓడిపోయినప్పటికీ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఆయనకు ఈసారి కలిసి వచ్చింది. మరోవైపు మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి హస్తం పార్టీలో చేరకుండా ఆయన శాయశక్తుల అడ్డుకుంటున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇదే సందర్భంలో అల్లోల అనుచరులను పార్టీలోకి రప్పించడంలో కీలక పాత్ర పోషిస్తున్నట్లు తెలుస్తోంది. ఓవైపు ఇంద్రకరణ్‌రెడ్డి ని బలహీనపరచడం, మరోవైపు పార్టీలో చేరికలను పెంచి తాను బలపడటం అన్న ధోరణిలో శ్రీహరిరావు ముందుకు సాగుతున్నారు. తానే స్వయంగా సీనియర్ నాయకులతో మాట్లాడుతూ పార్టీలోకి ఆహ్వానిస్తున్నారు. ఇప్పటికే నిర్మల్ నియోజకవర్గంలోని అన్ని మండలాలలో కారు పార్టీని ఖాళీ చేశారు. సీనియర్ నేతలు అందరికీ కాంగ్రెస్ కండువా వేశారు. పార్టీతోపాటు వ్యక్తిగతంగాను బలాన్ని పెంచుకుంటున్నారు.

కారు దిగుతున్న సీనియర్లు..

అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపాలైనప్పటి నుంచి బీఆర్‌ఎస్ బలహీనమవుతూ వస్తోంది. ప్రధానంగా జిల్లాలోని నిర్మల్, ముథోల్ నియోజకవర్గాలలో సీనియర్ నేతలందరూ పార్టీకి టాటా చెబుతూ హస్తం గూటికి చేరుతున్నారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరికతో సీనియర్ల పార్టీ మార్పు మొదలైంది. దాదాపు రెండు నియోజకవర్గాలలోని ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, పార్టీ మండల అధ్యక్షులు, సీనియర్ కార్యకర్తలు కాంగ్రెస్ కండువా వేసుకున్నారు. మిగిలిన వాళ్లు సైతం రేపోమాపో చేరేందుకు సిద్ధమన్నట్లుగా సంకేతాలు ఇస్తున్నారు. మొత్తంగా జిల్లాలో కారు పార్టీ ఖాళీ అవుతోంది. ఇప్పటికే ఖానాపూర్ మున్సిపల్ హస్తగతం కాగా, తాజాగా గండ్రత్ ఈశ్వర్ సైతం కాంగ్రెస్‌వైపు వెళ్తుండటంతో నిర్మల్ మున్సిపాలిటీని కూడా బీఆర్‌ఎస్ కోల్పోనుంది.

బీఆర్‌ఎస్‌కు మున్సిపల్ చైర్మన్ రాజీనామా



గండ్రత్ ఈశ్వర్

నిర్మల్‌టౌన్: నిర్మల్ పట్టణ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని బీఆర్‌ఎస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు నిర్మల్ మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ ప్రకటించారు. జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో శనివారం మాట్లాడారు. రాజీనామా పత్రాన్ని పార్టీ అధ్యక్షుడు కేసీఆర్‌కు పంపినట్లు తెలిపారు. తనతో పాటు పలువురు కౌన్సిల ర్లు బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేయ నున్నట్లు పేర్కొన్నారు. త్వరలో కార్యాచరణ ప్రకటిస్తామని వెల్లడించారు.

అమ్మవారి సొమ్ముకే ఎసరు?

- బాసర ఆలయంలో అక్రమాలు
- మార్కెట్ ధరకన్నా ఎక్కువకు సరుకుల టెండర్లు
- ఆపై కాంట్రాక్టర్ నుంచి కమీషన్
- విజిలెన్స్ విచారణలో వెలుగులోకి..
- ఈవోకు చార్జీ మెమో



రికార్డులను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారి(ఫైల్)

భైంసా: బాసర సరస్వతీ అమ్మవారి సొమ్ముకే కొందరు అధికారులు ఎసరు పెట్టారు. ఆలయంలో అక్రమాలను అడ్డుకునేవారు లేకపోవడంతో ఏ ఛాన్స్ దొరికినా అక్రమార్కులు వదలడం లేదు. తాజాగా విజిలెన్స్ అధికారుల తనిఖీల్లో మరోమారు అక్రమాలు బయటపడ్డాయి. మార్చి 31న విజిలెన్స్ అధికారి రీజినల్ జాయింట్ కమిషనర్ కృష్ణవేణి బాసరకు వచ్చి ఆలయ రికార్డులను తనిఖీ చేశారు. ప్రసాదాల తయారీ కేంద్రానికి వెళ్లి తనిఖీ చేశారు. సెంట్రల్ రూమ్‌లో ఆ రోజు రికార్డులను పరిశీలించి ఇటీవలే ఈవోకు చార్జి మెమో ఇచ్చారు. బాసర సరస్వతీ అమ్మవారి ఆలయంలో ప్రసాదాల తయారీ కేంద్రంలోనూ టెండరు ఖరారు విషయంలో, కాంట్రాక్టరుకు కట్టబెట్టిన విషయంపై ఈవో వివరణ కోరుతూ దేవాదాయ శాఖ కమిషనర్ హన్మంత్‌రావు మెమో జారీచేశారు. బాసర సరస్వతి ఆలయంలో టెండర్ల విషయంలో మార్కెట్ రేట్ల కన్నా అధిక రేట్లకు ఖరారు విషయంతోపాటు ఇతర అంశాలపై క్రమశిక్షణ చర్యలు ఎందుకు తీసుకోరాదో వివరణలో కోరారు. ఎట్టి పరిస్థితుల్లో అవకతవకలను సహించేదిలేదని మెమోలో పేర్కొన్నారు.

ఇదీ జరిగింది..

బాసర సరస్వతి అమ్మవారి ఆలయంలో అన్నదానం, ప్రసాదాల తయారీసహా, గుడిలో ఉపయోగించే నిత్యావసర సరుకులను మార్కెట్ కంటే అధిక ధరలకు కొనుగోలు చేస్తున్నారనే ఆరోపణలపై అందిన ఫిర్యాదు మేరకు దేవాదాయశాఖ దృష్టిసారించింది. హైదరాబాద్‌కు చెందిన వ్యాపారి మూడు సంవత్సరాల పేరుతో టెండర్లలో పాల్గొంటూ గత కొన్నేళ్లుగా ఈ కాంట్రాక్టు దక్కించుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఒకే వ్యాపారి మూడు సంస్థల పేరిట వరుసగా టెండర్లు దక్కించుకుంటూ ఆలయ అధికారులతో కలిసి అమ్మవారి సొమ్మును అక్రమంగా కాజేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నారు.

అధిక ధరలు ఇలా..

సదరు టెండరు దక్కించుకున్న వ్యాపారికి కిలో జెమిని టీ పొడికి మార్కెట్‌లో రూ.440 అని ప్యాకెట్‌పై ముద్రించి ఉన్నప్పటికీ అధికారులు మాత్రం రూ.530 చెల్లించి సదరు కాంట్రాక్టరు వద్ద కొనుగోలు చేశారు. సన్‌ఫ్లవర్ ఆయిల్ మార్కెట్‌లో లీటరు రూ.120 ఉండగా అధికారులు మాత్రం రూ.223 చెల్లించి కొనుగోలు చేశారు. డాబర్‌హనీ మార్కెట్‌లో కిలో రూ.400 ఉండగా అధికారులు రూ.458 చెల్లించారు. డాబర్‌ఆమ్లా ఆయిల్ 180 మిల్లీలీటర్లు రూ.90 మార్కెట్ ధర ఉండగా రూ.180 చెల్లించారు. స్వస్తిక్ కారం పొడి మార్కెట్ కిలో రూ.255 ఉండగా అధికారులు రూ.410 చెల్లించారు. స్వస్తిక్ పసుపుపొడి రూ.240 ఉండగా అధికారులు రూ.298 చెల్లించారు. సబీనా డిష్ వాష్ పౌడర్ మార్కెట్‌లో రూ.27 ఉండగా అధికారులు రూ.37 చెల్లించి కొనుగోలు చేశారు. బాసర ఆలయంలో నిత్యాన్నదానంతోపాటు ప్రసాదాల తయారీలో వినియోగించే రోజువారీ సరుకుల ధరలోనే ఇలా అధికంగా చెల్లిస్తుంటే.. సాంకేతికంగా తెలియని విషయాల్లో, మరమ్మతుల పేరిట ఎంత మేర అక్రమాలు జరిగాయో అనే అనుమానాలు తలెత్తుతున్నాయి.

ఏమని వివరణ ఇస్తారో...

సంబంధిత విషయమై ఫిర్యాదు వచ్చిన నేపథ్యంలో విజిలెన్స్ అధికారిని దేవాదాయశాఖ రీజినల్ జాయింట్ కమిషనర్ కృష్ణవేణి మార్చి 31న బాసర వచ్చి తనిఖీలు చేశారు. ఏప్రిల్ 1న బాసరలోనే ఉండి అన్ని వివరాలు సేకరించారు. ఆ సమయంలో దృష్టికి వచ్చిన అన్ని విషయాలను ఉన్నతాధికారులకు నివేదించారు. అక్రమాల విషయంపై ఈవోకు ఇప్పటికే చార్జీ మెమో జారీచేశారు. అందులో వివరణ కోరుతూ పలు అంశాలను జోడించారు. సంబంధిత అంశాలపై సమాధానం ఇవ్వాలని పేర్కొన్నారు. టెండరు సమయంలో అధికారులు ఎందుకు నిర్లక్ష్యం వహించారో సమాధానం చెప్పాలని మెమోలో పేర్కొన్నారు. నిత్యావసర సరుకుల ధరలు చుట్టుపక్కల మార్కెట్‌లో పోల్చుకోకుండానే టెండరును ఎలా కట్టబెట్టారని వివరణ అడిగారు. ఇక స్టోర్‌రూమ్‌లో రికార్డుల్లో వ్యత్యాసం ఎందుకు ఉందని అడిగారు. అధికారులు సమీక్షలు నిర్వహించిన సమయంలో నిల్వలు సరిచూసుకోరా అని ప్రశ్నించారు. పరిపాలనలోపాల వల్లే ఇలా జరుగుతుందని దీంతో గుడితోపాటు గుడికి ఉన్న విశిష్టత, ప్రతిష్ట దెబ్బతింటుందని, నిబంధనల ప్రకారం ఎందుకు చర్యలు తీసుకోకూడదో 15 రోజుల్లోగా సమాధానం ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ విషయమై ఎలా సమాధానం ఇవ్వాలో అక్రమాలకు పాల్పడ్డ అధికారులు ఆలోచనలు చేస్తున్నారు. చార్జి మెమోకు వివరణ ఇచ్చి ఇందులో నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. ఈ అవినీతి బయటపడితే బాసరలో జరిగిన అన్ని విషయాలపై విచారణ జరిగి అవినీతి బాగోతం బయటకు వస్తుందని సదరు అధికారులు పావులు కదుపుతున్నారు.

ఎందుకు అప్పగించారో..?



ప్రసాదాల స్టోర్ రూం..

బాసర సరస్వతి ఆలయంలో పనిచేసే ఓ ఉద్యోగి రెండు నెలల క్రితం సస్పెన్షన్‌కు గురయ్యారు. ఇటీవలే అదే అధికారికి విధులు నిర్వహించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. గతంలో తప్పుచేసిన ఈ అధికారికి ప్రాధాన్యతలేని పోస్టును అప్పగించాలని ఉన్నతాధికారులు సూచించారు. అయినా సదరు అధికారిని లడ్డూ స్టోర్ రూమ్ అప్పగించడం అనుమానాలకు తావిస్తోంది. స్టోర్‌రూమ్‌లో నిల్వలపైన విజిలెన్స్ అధికారి సమక్షంలోనే తేడాలు ఉన్నట్లు గుర్తించారు. ఓసారి సస్పెన్షన్‌కుగురైన అధికారిని ప్రాధాన్యతలేని పోస్టులో కొనసాగించాలని ఉన్నతాధికారులు సూచించినా ఇక్కడి అధికారులు మాత్రం ప్రసాదాల తయారీ స్టోర్‌రూమ్ అప్పగించడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. బాసర సరస్వతి అమ్మవారి ఆలయంపై విజిలెన్స్‌తోపాటు దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు దృష్టిసారిస్తే మరిన్ని అక్రమాలు బయటకు వచ్చే అవకాశం ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ఆలయంలో అవినీతి బాగోతంపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించాలని భక్తులు, స్థానికులు కోరుతున్నారు.

క్లుప్తంగా

కల్తీకల్లు దుకాణాలపై ఎక్సైజ్ దాడులు



స్వాధీనం చేసుకున్న కల్తీకల్లు ప్యాకెట్లతో ఎక్సైజ్ అధికారులు

ఆదిలాబాద్‌టౌన్: తలమడుగు మండలంలోని ఝరి, తలమడుగు, కుచులాపూర్, ఉమ్రి, ఆదిలాబాద్ రూరల్ మండలంలోని తంతోలి, అంకోలి, లోకారి గ్రామాల్లోని కల్తీ కల్లు దుకాణాలపై ఎక్సైజ్ అధికారులు శనివారం దాడులు చేశారు. ఎలాంటి అనుమతి లేకుండా కల్తీ కల్లు విక్రయిస్తున్న ఐదుగురిపై కేసులు నమోదు చేయడంతో పాటు 143 లీటర్ల తెల్లకల్లును ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సీఐ విజేందర్ తెలిపారు. అనుమతి లేకుండా తెల్ల కల్లు విక్రయించినట్‌లైతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

కుంటాల: మండలంలోని లింబా(కె) గ్రామ శివారులో వన్నెల బాజన్న అనే రైతుకు చెందిన ఆవు శనివారం విద్యుదాఘాతంతో మృతి చెందింది. గాలివానకు విద్యుత్ మోటార్‌కు సంబంధించిన విద్యుత్ తీగ తెగి పడడంతో ఈ ప్రమాదం సంభవించింది. ఆవు విలువ రూ.65 వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపాడు. ఘటన స్థలాన్ని లైన్‌మెన్ రమేష్, జూనియర్ లైన్‌మెన్ గజేందర్ పరిశీలించారు.

అధికారులకు నెమలి అప్పగింత



నెమలిని అప్పగిస్తున్న రైతు హుల్గుండే ఓం

గుడిహత్నూర్: మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన హుల్గుండే ఓం తన వద్ద ఉన్న నెమలిని అటవీ అధికారులకు అప్పగించారు. కొద్ది నెలల క్రితం తన చేనులో గాయాలతో దొరికిన నెమలికి చికిత్స అందించి బాగు చేశాడు. ఆరోగ్యంగా ఉన్న నెమలిని తిరిగి అడవిలో వదలాలని అనుకొని ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ కృష్ణనాయక్‌కు సమాచారం అందించాడు. దీంతో అధికారులు వచ్చి నెమలిని తీసుకెళ్లారు. మావల హరితవనంలో సంరక్షించనున్నట్లు వారు తెలిపారు. బీట్ అధికారి వెంట బేస్ క్యాంపు వాచర్ సిద్ధార్థ్ ఉన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

గుడిహత్నూర్: రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతున్న యువకుడు మృతి చెందాడు. ఈనెల 9న తెల్లవారు జామున జాతీయ రహదారి 44పై దేవాపూర్ చెక్‌పోస్టు వద్ద కారు ప్రమాదంలో తీవ్రగాయాల పాలైన జిల్లా కేంద్రానికి చెందిన బానోత్ అక్షయ్ (22) నిజామాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మధ్యాహ్నం మృతి చెందాడు. అక్షయ్ జిల్లా పోలీసు కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అక్షయ్ అకాల మరణంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

ప్రభుత్వ ఉద్యోగులూ.. బహుపరాక్..!

- రాజకీయ పార్టీలకు అనుకూలంగా ఉంటే కఠిన చర్యలే..
- జిల్లా ఎన్నికల అధికారుల ప్రత్యేక దృష్టి
- ఉద్యోగ, ఉపాధ్యాయులు అప్రమత్తం..



కంట్రోల్‌రూమ్ సిబ్బందికి సూచనలు చేస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్(ఫైల్)

నిర్మల్‌ఖిల్లా: పార్లమెంటు ఎన్నికల పోలింగ్ తేదీలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాల్సిన సమయమిది. ప్రస్తుతం ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున రాజకీయ పార్టీలకుగానీ, పోటీలో ఉన్న అభ్యర్థులకుగానీ అనుకూలంగా వ్యాఖ్యలు చేసినా, సభలు సమావేశాల్లో పాల్గొన్నట్లు ఆధారాలున్నా కఠిన చర్యలు తీసుకోవడానికి ఎన్నికల కమిషన్, జిల్లా ఎన్నికల అధికారులు సిద్ధమవుతున్నారు. ఇందుకుగాను ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులపై ఎన్నికల సర్వేలైన్స్ బృందాలు ప్రత్యేక నిఘా పెట్టాయి.

సిద్దిపేట జిల్లాలో 106 మందిపై వేటు..

ఇటీవల సిద్దిపేట జిల్లాలో ఓ రాజకీయ పార్టీకి చెందిన అభ్యర్థి నిర్వహించిన సమావేశానికి వెళ్లిన 106 మంది సెర్ప్, ఈజీఎస్ ఉద్యోగులపై ఎన్నికల అధికారి సస్పెన్షన్ వేటు వేశారు. ఎన్నికల ప్రవర్తన నియమాలని ఉల్లంఘించి ఒక రాజకీయ పార్టీ అభ్యర్థికి మద్దతుగా సమావేశానికి హాజరు కావడంతో ఎన్నికల సంఘం కొరడా ఝళిపించింది. ప్రత్యర్థి రాజకీయ పార్టీలవారు ఇచ్చిన ఫిర్యాదుతో రంగంలోకి దిగిన ఎన్నికల నిఘా విభాగం అధికారులు ఆ సమావేశానికి హాజరైన ఉద్యోగుల వివరాలు సేకరించి సస్పెన్షన్ వేటు వేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయులువర్గాల్లో అలజడి మొదలైంది. ఎన్నికల వేళ ఈ సంఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని నిఘా బృందాలు సైతం ఉద్యోగ, ఉపాధ్యాయులపై ప్రత్యేక దృష్టి సారించాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో శాశ్వత, ఒప్పంద, పొరుగు సేవల ఉద్యోగులందరూ దాదాపు 45 వేల వరకు ఉంటారని అంచనా. వీరు రాజకీయ పార్టీలకు మద్దతుగా నిలిచినా లేదా ఆత్మీయ సమ్మేళనాల పేరిట ఆయా పార్టీల సమావేశాలకు హాజరైనా, మద్దతుగా ప్రచారం నిర్వహించినా నిబంధనల మేరకు చర్యలు తీసుకునేలా అధికారులు నిఘా పటిష్టం చేశారు.

ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో ఎన్నికల విధులు నిర్వహించనున్న ఉద్యోగులు..	
నిర్మల్	1,554
ఖానాపూర్	1,555
ముథోల్	1,584
బోథ్	1,472
ఆదిలాబాద్	1,412
ఆసిఫాబాద్	1,480
సిర్పూర్	1,432

అప్రమత్తంగా ఉండాల్సిందే...

ప్రభుత్వ శాఖల ఉద్యోగులు లేదా ఉపాధ్యాయులు ఇతర కాంట్రాక్టు పొరుగు సేవల సిబ్బంది ఎన్నికల్లో పాల్గొనే రాజకీయ పార్టీలకు ప్రచారం చేయరాదనే నిబంధనలు 1949, సెప్టెంబర్ 17వ తేదీ నుంచి అమలులో ఉన్నాయి. ఈ చట్టంలోని సెక్షన్ 23 (ఐ) ప్రకారం వీరందరూ ఎన్నికల కోడ్ పరిధిలోకి వస్తారు. ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులతోపాటు ఇతర అనుబంధ ప్రభుత్వరంగ సంస్థల్లో పని చేసే అన్ని కేటగిరీలు, స్థాయిల్లోని ఉద్యోగులు, సిబ్బంది పారదర్శకంగా వ్యవహరించాల్సి ఉంటుందని నిబంధనలు తెలుపుతున్నాయి. ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు ప్రతీ అధికారి ఉద్యోగి, సిబ్బంది తనవంతు బాధ్యతను సక్రమంగా నిర్వర్తించాల్సి ఉంటుంది. ఎలాంటి పక్షపాత వైఖరిని ప్రదర్శించకూడదు. ప్రభుత్వం సూచించే ఎన్నికల విధులను నిష్పక్షపాతంగా నిర్వహించాల్సి ఉంటుంది. ప్రస్తుతం ప్రతి ఒక్కరి వద్ద మొబైల్ ఫోన్ అందుబాటులో ఉంది. అయితే సోషల్ మీడియాలో హద్దులు మీది రాజకీయపక్షాలకు సంబంధించిన పోస్టులు పెట్టినా, పోటీలో ఉన్న అభ్యర్థులను కించపరిచేలా లేదా మద్దతుగా కామెంట్లు చేసినా తిప్పలు తప్పేలా లేవు. ఎన్నికల నిఘా బృందాలు, పోలీసులు, సైబర్ క్రైమ్ విభాగం అధికారుల సమన్వయంతో తీక్షణమైన నిఘాపెట్టి పరిశీలన చేస్తున్నారు. వ్యక్తిగత దూషణలు, రెచ్చగొట్టేలా మెసేజ్‌లు, ఫొటోలు, మార్ఫింగ్ వంటివి చేసినా కేసుల నమోదుతోపాటు ఉద్యోగం నుంచి సస్పెన్షన్ వేటువంటివి కూడా ఉండే అవకాశం ఉంది.

హద్దులు దాటితే అంతే..

- ప్రభుత్వ ఉద్యోగులు, సిబ్బంది రాజకీయ పార్టీల కండువాలు వేసుకుని ప్రచారం చేయడం లేదా ఎదుటి పార్టీలను రెచ్చగొట్టే విధంగా మాట్లాడడం చేయకూడదు.
- ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థికి సహకరిస్తున్నారని ఏ చిన్న ఆధారం దొరికినా వేటు పడుతుంది.
- సామాజిక మాధ్యమాల్లోనూ ఒక పార్టీకో లేదా అభ్యర్థిగా వ్యతిరేకంగానో, సానుకూలంగానో పోస్టులు పెట్టినా చర్యలు ఉంటాయి.
- ఉన్నత స్థానంలో ఉన్న ప్రభుత్వ అధికారి తన కిందిస్థాయి సిబ్బందికి అధికార దర్పంతో ఒక పార్టీకి లేదా ఫలానా అభ్యర్థికి మద్దతు తెలపాలని, సహకరించాలని సూచించకూడదు.

ఎడ్లబండెక్కిన పడవ..!



ఓడలు బండ్లవుతాయి.. బండ్లు ఓడలు అవుతాయి అనేది సామెత. కానీ, ఇక్కడ ఓ పడవే బండెక్కింది. రెండూ కలిసి ప్రయాణం సాగించాయి. ఈ దృశ్యం అందరినీ ఆకట్టుకుంది. దస్తురాబాద్ మండల కేంద్రంలోని పెద్ద చెరువులో నీటిమట్టం తగ్గుతోంది. దీంతో మత్స్యకారులు చేపలు పట్టేందుకు సమాయత్తం అవుతున్నారు. ఈ క్రమంలో పడవలను చెరువు వద్దకు చేరుస్తున్నారు. శనివారం ఓ పడవను ఎడ్ల బండిపై ఇలా తీసుకువస్తున్న దృశ్యం 'సాక్షి' కెమెరాకు చిక్కింది. - దస్తురాబాద్

మొర్రిపండ్లు వచ్చేశాయ్



మార్కెట్‌లో విక్రయిస్తున్న మొర్రిపండ్లు

నిర్మల్‌ఖిల్లా: కొన్ని ఫలాలు కొన్ని సీజన్లలో మాత్రమే లభిస్తాయి. అందుకే మన పెద్దవాళ్లు ఏ సీజన్‌లో ఏ పండ్లు దొరుకుతాయో వాటిని అస్సలు వదలొద్దని చెబుతుంటారు ఆరోగ్య నిపుణులు. అలాంటివాటిలో వేసవికాలంలో అటవీ ప్రాంతాల్లో సహజసిద్ధంగా లభించేవి మొర్రిపండ్లు. చూడగానే నోట్లో నీళ్లూరుతూ తియ్యతియ్యగా, పుల్లపుల్లగా ఉంటూ ప్రకృతిసిద్ధంగా లభించే వీటిలో పోషకాలు, విటమిన్స్, మినరల్స్ పుష్కలంగా ఉంటాయి. మండు వేసవిలో లభించే ఈ పండ్లు రుచిగా ఉండడంతో ఎక్కువమంది ఇష్టపడతారు. జిల్లా కేంద్రం సమీపంలోని అటవీప్రాంత గ్రామాల్లోని మహిళలు వీటిని సేకరించి విక్రయించడానికి నిర్మల్ జిల్లా కేంద్రంలోని మార్కెట్‌కు తెస్తున్నారు. ఒక్కో చిన్నగ్లాసుతో కొలిచిన పండ్లను పది రూపాయలకు ఇస్తున్నారు. మొర్రి పండ్లలో ఫైబర్, విటమిన్ బీ1, బీ2, సి, నియాసిన్, ఐరన్, కాల్షియం, ప్రొటీన్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి కాయలుగా ఉన్నప్పుడు ఆకుపచ్చ రంగులోను, పండిన తర్వాత మాత్రం నల్లగా ఉంటాయి. ముఖ్యంగా ఇవి వేసవికాలం ఉగాది, శ్రీరామనవమి సమయంలోఎక్కువగా లభిస్తాయని, వీటిని సేకరించి తెచ్చి అమ్మి ఉపాధి పొందుతామని విక్రయదారులంటున్నారు. మొర్రిపండ్ల శాస్త్రీయనామం 'బుంచనానీయా లాటిఫొలియా'. ఇవి మన శరీరంలోని ఇమ్యునిటీని పెంచుతాయి. చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి.

గర్భిణి మృతికి వైద్యులే కారణమని ఆందోళన



ఆస్పత్రి వద్ద పోలీసుల బందోబస్తు

నిర్మల్‌టౌన్: ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం ఝరి గ్రామానికి చెందిన గర్భిణి మృతికి కారణం వైద్యులే కారణమని మృతురాలి కుటుంబీకులు శనివారం నిర్మల్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేశారు. బాధిత కుటుంబీకుల వివరాల ప్రకారం.. ఝరి గ్రామానికి చెందిన హారతి(25) ప్రసవానికి జిల్లా కేంద్రంలోని డాక్టర్స్ లేన్ కాలనీలో ఉన్న డీఎస్‌కే ఆసుపత్రికి పది రోజుల క్రితం తీసుకువచ్చారు. ప్రసవం అయి హారతి బాబుకు జన్మనిచ్చింది. తర్వాత మహిళ తీవ్ర అస్వస్థతకు గురికావడంతో.. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ.. శనివారం మృతి చెందింది. దీంతో ఆమె మృతదేహాన్ని నిర్మల్‌లోని ఆసుపత్రి ఎదుట ఉంచి ఆందోళన చేశారు. స్థానికంగా నాణ్యమైన వైద్యం అందించక పోవడం, ఇక్కడి వైద్యుల నిర్లక్ష్యంతోనే హారతి మృతి చెందిందని ఆరోపించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని వైద్యులతో మాట్లాడించి గొడవను సర్దుమణిగించారు. కాగా, హారతికి రెండేళ్ల కూతురు కూడా ఉంది.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



వద్యాల్‌లో కాలిపోయిన ఇంటి లోపలి భాగం

లక్ష్మణచాంద: మండలంలోని వడ్యాల్ గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైంది. గ్రామానికి చెందిన తలారి శ్రీనివాస్‌తోపాటు కుటుంబ సభ్యులు శనివారం ఉదయం ఉపాధిహామీ పనికి వెళ్లారు. 10.20 గంటల సమయంలో ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు చెలరేగాయి. క్షణాల్లో మంటలు ఇల్లంతా వ్యాపించి పూర్తిగా కాలిపోయింది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వచ్చేసరికి గోడలే మిగిలాయి. ఈ ఘటనలో ఇంట్లోని వస్తువుల తోపాటు, పనుల కోసం తెచ్చుకున్న రూ.50 వేల నగదు కాలిపోయాయని బాధితులు తెలిపారు. కాలిపోయిన ఇంటిని ఆర్‌ఐ దేవిక పరిశీలించారు. రూ.2.50 లక్షల ఆస్తినష్టం జరిగినట్లు అంచనా వేశారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితులు వేడుకున్నారు.

పేలిన ట్రాక్టర్ టైరు..

- డ్రైవర్ మృతి
- కిందకు దూకి ప్రాణాలు కాపాడుకున్న మృతుని సోదరులు
- సారంగాపూర్ మండలంలో ఘటన



దయాకర్(ఫైల్)

సారంగపూర్: ట్రాక్టర్ టైరు పేలడంతో వాహనం అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో డ్రైవర్ మృతిచెందగా, అతని సోదరులు కిందకు దూకి ప్రాణాలు కాపాడుకున్నారు. ఈ ఘటన సారంగాపూర్ మండలం ఆలూరు గ్రామంలో శనివారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నిర్మల్‌లోని వైఎస్సార్ కాలనీకి చెందిన దండ్ల దయాకర్(21)స్థానికంగా ఓవ్యక్తి వద్ద డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆలూరు గ్రామ శివారులోని పంటపొలంలో రాళ్లు తొలగించడంతో వాటిని తీసుకుని గ్రామ శివారులో పాడేయడానికి ట్రాక్టర్‌లో వేసుకుని బయల్దేరారు. ఆయన వెంట సోదరులు దండ్ల సురేశ్, గంగాధర్ కూడా వెళ్లారు. కొంత దూరం వెళ్లాక ట్రాక్టర్ ముందుటైరు పేలడంతో అదుపుతప్పి బోల్తా పడింది. ట్రాక్టర్ కిందపడిన దయాకర్‌కు తీవ్ర గాయాలు కాగా, అతని సోదరులు కిందకు దూకి ప్రాణాలు కాపాడుకున్నారు. దయాకర్‌ను నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతిచెందాడు. కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై చంద్రమోహన్ తెలిపారు.

కిరాణాషాపులో చోరీ



చోరీ జరిగిన కిరాణషాపు ఇదే

కుభీర్: మండల కేంద్రంలోని రషీద్ కిరాణా షాపులో శుక్రవారం రాత్రి దొంగతనం జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు షాపులో చొరబడి గల్లాలోని నగదు, ఒక నూనె డబ్బా, వాణి, గణేశ్ బీడీ కట్టలు, సిగరెట్ డబ్బాలు ఎత్తుకెళ్లారు. షాపు కుడివైపున ఉన్న షెటర్ పైకి ఎత్తి లోనికి చొరబడ్డారు. ఈ దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు క్లూస్ టీం వారు వచ్చి వేలు ముద్రలు సేకరించారు. షాపు యజమాని రయీస్ 50 వేల విలువైన సరుకులు చోరీ అయినట్లు చేసిన ఫిర్యాదు మేరు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవీందర్ తెలిపారు.



దొంగలు చొరబడింది ఈ షెటర్ నుంచే..

గంజాయి విక్రయిస్తే చర్యలు తప్పవు

- ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ నాగేందర్

ఉట్నూర్‌రూరల్: గంజాయి సాగుచేసినా, విక్రయించినా చట్ట రీత్యా చర్యలు తప్పవని ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్ హెచ్చరించారు. ఉట్నూర్ పోలీసుస్టేషన్‌లో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇంద్రవెల్లి మండల కేంద్రంలో గంజాయి విక్రయాలు జరుగుతున్నట్లు అందిన సమాచారం మేరకు ఉట్నూర్ సీఐ మొగిలి, ఇంద్రవెల్లి ఎస్సై సునీల్ బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. ఈ క్రమంలో ఇంద్రవెల్లి మండలం ముత్నూర్ శివారులో జగిత్యాల జిల్లాకు చెందిన రాకేశ్, ముద్దం రాంచరణ్ పట్టుబడగా.. వారి వద్ద 510 గ్రాముల గంజాయి లభ్యమైంది. వారు ఇచ్చిన సమాచారంతో మర్కగూడ వద్ద మెస్రం షేకు, మెస్రం రవీందర్, కుమ్ర రాంజీని అదుపులోకి తీసుకొని తనిఖీ చేయగా వారి వద్ద 500 గ్రాముల గంజాయి లభ్యమైనట్లు పేర్కొన్నారు. మరో వ్యక్తి సుగ్నాక భీంరావు పరారీలో ఉన్నట్లు తెలిపారు. మొత్తం రూ.26,500 విలువ గల గంజాయితో పాటు ఒక ద్విచక్ర వాహనం, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు. సమావేశంలో ఉట్నూర్ సీఐ మొగిలి, ఉట్నూర్, ఇంద్రవెల్లి ఎస్సైలు మనోహర్, సునీల్ ఉన్నారు.

రాజ్యాంగ పరిరక్షణకు ఐక్యం కావాలి

- సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎం.అడివయ్య

నిర్మల్‌చైన్‌గేట్: రాజ్యాంగన్ని పరిరక్షించేందుకు లౌకిక వాదులు ఐక్యం కావాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎం.అడివయ్య అన్నారు. సీపీఎం జిల్లా విస్తృతస్థాయి సమావేశం జిల్లా కేంద్రంలోని ప్రజా సంఘలకార్యాలయంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు దుర్గం నూతన్‌కుమార్ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అడివయ్య మాట్లాడారు. కేంద్రంలో మోదీ నేతృత్వంలోని బీజేపీ పాలనతో లౌకికవాద, ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడ్డాయన్నారు. బీజేపీ, దాని మిత్రపక్షాలను ఓడించడమే ప్రతీ దేశభక్తుని బాధ్యత అన్నారు. పని హక్కును రాజ్యాంగ హక్కుగా చేర్చాలని, ప్రభుత్వ, ప్రభుత్వరంగ సంస్థల్లో ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. పట్టణ ఉపాధికి హామీ కల్పిస్తూ కొత్త చట్టాన్ని రూపొందించాలని కోరారు. ప్రయివేటురంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికుల సంఖ్య 19 నుంచి 42.5 శాతానికి పెరిగిందన్నారు. ఉపాధి హామీ పథకానికి 2023–24 సంవత్సరంలో నిధులను 1.33 శాతానికి తగ్గించారని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి గౌతమ్‌కృష్ణ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొమ్మెన సురేశ్, బి.సుజాత, జిల్లా కమిటీ సభ్యులు తొడసం శంభు, గంగమణి, ఇప్ప లక్ష్మణ్, సీపీఎం నాయకులు డి.పోశెట్టి, నర్సయ్య, ముత్తన్న, లలిత, ప్రసాద, లక్ష్మి, పోశెట్టి, సాయికిరణ్, రాజేశ్వర్, నవీన్ పాల్గొన్నారు.

మద్యం పట్టివేత



పట్టుకున్న మద్యంతో అధికారులు

ఖానాపూర్: ఖానాపూర్ పట్టణం నుంచి మామడ మండలం దిమ్మదుర్తి గ్రామానికి అక్రమంగా తరలిస్తున్న సుమారు రూ.50 వేల విలువైన మద్యాన్ని పట్టుకున్నట్లు సీఐ సైదారావు, ఎస్సై లింబాద్రి తెలిపారు. ఫ్లయింగ్‌స్క్వాడ్ టీం ఆధ్వర్యంలో ఖానాపూర్ మండలం ఎక్బాల్‌పూర్ గ్రామం వద్ద చేపట్టిన వాహనాల తనిఖీల్లో ఆటోలో డ్రైవర్ మల్లేశ్, వినయ్ అనే వ్యక్తికి చెందిన మద్యాన్ని తరలిస్తుండగా ఫ్లయింగ్ స్క్వాడ్ టీం ఇన్‌చార్జి రవీందర్ ఆధ్వర్యంలో పట్టుకున్నారు. తనిఖీల్లో ఏఎస్సై దేవ్, కానిస్టేబుల్ ముజీబుద్దీన్, వీడియో గ్రాఫర్ ముఖీద్ తదితరులు పాల్గొన్నారు.

నచ్చన్‌ఎల్లాపూర్‌లో..

కడెం: మండలంలోని నచ్చన్‌ఎల్లాపూర్ గ్రామానికి చెందిన వేముల శ్రీనివాస్ కిరాణా షాపుపై పోలీసులు శనివారం దాడిచేశారు. ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి ఆధ్వర్యంలో తనిఖీలు చేశారు. అక్రమంగా నిల్వ ఉంచిన రూ.20 వేల విలువైన మద్యం స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా మద్యం అమ్మితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని, కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

బెల్టు షాపులపై దాడి

భైంసా: నిజామాబాద్ – భైంసా ప్రధాన రహదారి వెంట నిర్వహిస్తున్న బెల్టు షాపుపై ఎక్సైజ్ పోలీసులు శనివారం దాడి చేశారు. రైల్వేస్టేషన్ సమీపంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు అందిన సమాచారంతో తనిఖీ చేసి రూ.60 వేల విలువైన మద్యం పట్టుకున్నారు. తనిఖీల్లో భైంసా ఎక్సైజ్ ఎస్సై గజేందర్ పాల్గొన్నారు.

రూ.13.50 లక్షలు పట్టివేత



సోన్ మండలం గంజాల్ టోల్ ప్లాజా వద్ద పట్టుకున్న నగదుతో ఎస్సై, సిబ్బంది..

సోన్: మండలంలోని గంజాల్ టోల్ ప్లాజా వద్ద పోలీసులు శనివారం వాహనాల తనిఖీ చేపట్టారు. హైదరాబాద్ నుంచి మహారాష్ట్ర వెళ్తున్న ఐచర్ వ్యాన్‌ను తనిఖీ చేశారు. ఇందులో వాహన ఓనర్లు మహ్మద్ జావిద్, మహ్మద్ మన్సూర్ అలీ వద్ద వరుసగా రూ.7 లక్షలు, రూ.6.50 లక్షలు పట్టుకున్నారు. మొత్త రూ.13.50 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రవీందర్ తెలిపారు. ఈ నగదుకు సంబంధించి ఎలాంటి పత్రాలు చూపలేదని పేర్కొన్నారు. తనిఖీల్లో భీమేశ్, శివ, దల్లుసింగ్, భూమేశ్వర్, రాజు, నరోత్తంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫౌజ్‌పూర్ సమీపంలో రూ.2.50లక్షలు..



పట్టుకున్న నగదుతో ఎఫ్ఎస్‌టీ అధికారులు

జైనథ్: మహారాష్ట్రలోని చంద్రాపూర్ నుంచి ఆదిలాబాద్ వైపు వెళుతున్న కే.చందు నుంచి రూ.2.50లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎఫ్ఎస్‌టీ టీం లీడర్ శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని ఫౌజ్‌పూర్ సమీపంలో జాతీ య రహదారిపై తనిఖీలు నిర్వహిస్తుండగా సదరు వ్యక్తి ఎలాంటి రశీదు లేకుండా నగదు తీసుకెళ్తున్నాడు. ఈ క్రమంలో నగదు స్వాధీ నం చేసుకుని ఎన్నికల విభాగం అధికారుల కు అప్పగించినట్లు తెలిపారు. ఇందులో గణేశ్, కిష్టన్న, చంద్రశేఖర్ ఉన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

LAND FOR SALE

■ Luxury Farm House For Sale at Moinabad, KethireddyPally, Fully Furnished, Ready to Occupy, North-East Facing & North Facing Plots at NRI Farms Venture Gated Community, Clear Tittle with Land Area 13.5 Guntas/1633 Square Yards, Agricultural Lands are also Available for Sale. Cont: 8555857167 [H-804847]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 18K. Ph:9160900024/9640400073 [H-799868]

■ పనివారు కావలెను. హైదరాబాద్, బెంగళూరులో ఉండి ఇంటిపని, వంటపని, వృద్ధుల సేవ, పిల్లల పోషణకు స్త్రీలు, కావలెను. సంప్ర।। 9391912949, 040-40123376. [H-799726]

WANTED

■ రామగుండం మరియు బెల్లంపల్లి రైల్వేస్టేషన్ నందు పనిచేయుటకు టెలికాలర్స్ కావలెను. Q: Degree, నోట్: హిందీ, ఇంగ్లీష్ వచ్చి వుండవలెను. జీతం: 12,000+PF, ESI. సంప్ర।। 7330779659 [K-1187132]

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్స్ కలవు. మీ పేరు, అడ్రస్ కాల్ / వాట్సప్ చేయగలరు. 90596 63584, 95026 15217. [M-1185031]

www.sakshi.com

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888, 9010299065,
9951602823, 9010608462,

క్లుప్తంగా

సమస్యల పరిష్కారానికి కృషి


జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

ఖానాపూర్: టీఎస్‌యూటీఎఫ్ పదేళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా ఆ సంఘం నాయకులు శనివారం పట్టణంలో జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దాసరి శంకర్ మాట్లాడుతూ సంఘం ఏర్పడిన నాటి నుంచి ఉపాధ్యాయులతో పాటు ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి విశేష కృషి చేశామన్నారు. ప్రభుత్వం ఎన్నికల కమిషన్ అనుమతి తీసుకుని వెంటనే మూడు డీఏలను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మురళీధర్, అనిల్, రాజేందర్, రమేశ్, నారాయణ, రాజు, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పూజలు


యజ్ఞంలో పాల్గొన్న భక్తులు

భైంసారూరల్: మండలంలోని కామోల్ శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో శ్రీరామనవమి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. శనివారం గీతామహాయజ్ఞం నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహిస్తున్నారు. దేగాం గ్రామంలోని సాయిబాబా ఆలయంలోనూ శ్రీరామనవమి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా సప్తాహం నిర్వహిస్తున్నారు.

పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న సభ్యులు

నిర్మల్‌టౌన్: శ్రీరామనవమిని పురస్కరించుకుని ఈ నెల 17న హిందూవాహిని నిర్మల్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న భారీ శోభాయాత్రను విజయవంతం చేయాలని కోరుతూ శనివారం సోఫీనగర్ కాలనీలో పోస్టర్ ఆవిష్కరించారు. దేవరకోట ఆలయం నుంచి నిర్వహించనున్న శోభాయాత్రకు హిందూ బంధువులు అధికసంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని హిందూవాహిని సభ్యులు కోరారు.

నేడు బైక్ ర్యాలీ

నిర్మల్‌టౌన్: అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని బుద్ధ విహార్ నుంచి ట్యాంక్‌బండ్ అంబేడ్కర్ విగ్రహం వరకు ఆదివారం ఉదయం 9 గంటలకు బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు దళిత సంఘాల నాయకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ర్యాలీ అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించి జయంతి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నిర్మల్‌చైన్‌గేట్: గాజులపేట 11కేవీ ఫీడర్, బంగాల్ పేట ఫీడర్, నటరాజ్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ రవి ఒక ప్రకటనలో తెలిపారు. గాజులపేట, డాక్టర్స్ లేన్, కొమ్ము నారాయణ రైస్‌మిల్, బైల్ బజార్, అగ్రికల్చర్ మార్కెట్, మోచి గల్లీ, బుధవార్‌పేట్, గాంధీ చౌక్, కబూతర్ కమాన్, నాయుడు వాడ, బోయవాడ, రామ్‌రావుభాగ్, భాగ్యనగర్, నటరాజ్ నగర్, చైన్‌గేట్, ఇంద్రనగర్, గొల్లపేట, శాస్త్రినగర్, బోయవాడ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం వుంటుందని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని భాగ్యనగర్ కాలనీ శ్రీ భక్తాంజనేయస్వామి ఆలయ అభివృద్ధి కమిటీ నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు గౌరవ అధ్యక్షులు కూన పెద్ద లింగన్న, పాల్దీ సునీల్ తెలిపారు. అధ్యక్షుడిగా మెంగ శేఖర్, ప్రధాన కార్యదర్శిగా చాదల రాజన్న కోశాధికారిగా మాసపల్లి సురేష్, కోక్యాషియర్‌గా కిరసం భూరుని, ఉపాధ్యక్షులుగా కత్రోజి వెంకటరమణ, నల్ల పురుషోత్తంరెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా సిరుల భూమన్న యాదవ్, నలిమెల శ్రీకాంత్ రెడ్డి, ప్రచార కార్యదర్శులుగా అట్లోలి సంజీవ్ కుమార్, కందుల శేఖర్, సలహా సభ్యులుగా ఎ.గంగాధర్, మెంగ హరీష్, వి.తిరుపతి, కదం నరేష్, సుంకరి శివకుమార్, ప్రభాకర్, జుట్టు జైపాల్, ఇందూరి చంద్రశేఖర్ ఎన్నికైనట్లు వారు పేర్కొన్నారు.

అమరులకు నివాళులు

కుంటాల: స్వాతంత్ర్య పోరాటంలో అమరులైన వారి సేవలు చిరస్మరణీయమని ప్రిన్సిపాల్ సంతోష్, డైరెక్టర్ ప్రవీణ్ కుమార్ కొనియాడారు. శనివారం కుంటాల శాంతినికేతన్ పాఠశాలలో జలియన్ వాలాబాగ్ దుర్ఘటనలో అమరులైన వారికి నివాళులర్పించారు.

చెరువు మట్టితో చేనుకు మేలు


చెరువు మట్టిని పంట చేనులో పోస్తున్న ట్రాక్టర్

- రసాయనిక ఎరువుల వాడకంతో తగ్గనున్న భూసారం
- దిగుబడులపై ప్రభావం
- ఒండ్రుమట్టిలో అధిక పోషకాలు

కుంటాల: అధిక దిగుబడులు వస్తాయన్న ఆశతో రైతులు రోజురోజుకూ రసాయన ఎరువుల వాడకాన్ని అధికం చేశారు. దీంతో పంటచేలల్లో భూసారం తగ్గి దిగుబడులపై ప్రభావం చూపుతోంది. రసాయన ఎరువులు వినియోగం తగ్గించాలని అధి కారులు సూచిస్తున్నా రైతులు ఏమాత్రం తగ్గడంలేదు.

తగ్గిన దిగుబడులు

మండలంలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో రైతులు 13,430 ఎకరాల్లో పత్తి, 6,400 ఎకరాల్లో సోయా, 3 వేల ఎకరాల్లో వరి, 350 ఎకరాల్లో కందులు, 8,750 ఎకరాల్లో మొక్కజొన్న పంటలు సాగు చేశారు. గతేడాది సాగులో దిగుబడులు వస్తాయన్న ఆశతో రసాయన ఎరువులు అధికంగా వాడడం వల్ల పత్తి, సోయా పంటలపై ప్రభావం చూపింది. దిగుబడులు రాకరైతులు ఆర్థికంగా నష్టపోయారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులతో పాటు చెరువు మట్టిని పంట పొలాల్లో వేసుకోవాలని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు.

ప్రయోజనం

పంట పొలాల్లో చెరువు మట్టి వేసుకోవడం ద్వారా ప్రయోజనం చేకూరనుంది. చెరువు మట్టిలో నత్రజని, భాస్వరం, పొటాష్‌తో పాటు సూక్ష్మ పోషకాలు మెండుగా ఉంటాయి. నీటిని నిలుపుకునే శక్తి, రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. పంటలకు తెగుళ్ల బెడద ఉండకుండా సూక్ష్మ మిత్ర పురుగులు చేరి లాభాన్ని చేకూరుస్తాయి. చెరువు మట్టిలో 70 శాతం ఒండ్రు మట్టి, 30 శాతం బంక మట్టి ఉంటాయి. మే మాసంలో మాత్రమే చెరువు మట్టిని పంట పొలాలకు తరలించాలి. చెరువులో నీరు తగ్గిన తర్వాత అధికారుల సూచన మేరకు మట్టి పరీక్షలు చేయించి మట్టిని తరలిస్తే మేలు జరుగుతుందని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. పంటపొలంలోకి ఒకసారి మట్టిని తరలిస్తే నాలుగేళ్లపాటు పోషకాలు భూమిలో ఉంటాయని అధికారులు పేర్కొంటున్నారు. మండలంలోని రైతులు చెరువు మట్టిని పంటపొలాలకు తరలించే పనిలో నిమగ్నమయ్యారు.

ఎరువుల వినియోగం తగ్గించా



నాలుగేళ్లకోసారి పంట పొలానికి చెరువు మట్టిని తరలిస్తున్నా. రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించా. చెరువు మట్టితో ఎన్నో లాభాలు ఉన్నాయి. పంటపొలాల్లో చెరువు మట్టి వేసుకోవాలని తోటి రైతులకు కూడా సూచిస్తున్నా.

– ఎస్‌డీ ఖమర్, రైతు, ఓలా

పోషకాలు అధికం



రసాయనిక ఎరువుల వాడకంతో భూసారం తగ్గి దిగుబడులపై ప్రభావం చూపుతుంది. చెరువు మట్టిలో పోషకాలు అధికంగా ఉన్నాయి. పంటపొలాల్లో చెరువు మట్టి వేసుకోవడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చు. రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

– సోమ లింగారెడ్డి, ఏవో, కుంటాల

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి


ఫ్లాగ్‌మార్చ్‌లో పాల్గొన్న ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్

తానూరు: పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్ అన్నారు. శనివారం మండల కేంద్రమైన తానూరుతో పాటు కోలూరు, ఝరి(బి) గ్రామాల్లో పోలీసులు కవాతు నిర్వహించారు. 40 మంది పోలీసులతో గ్రామంలోని ఆయా వీధులలో కవాతు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సందీప్, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసుల ఆధ్వర్యంలో ఫ్లాగ్‌మార్చ్

ముధోల్: ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛాయుత వాతావరణంలో వినియోగించుకునే విధంగా భరోసా కల్పించడం కోసమే ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్నామని ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధైర్యంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో సీఐ మల్లేశ్, ఎస్సైలు సాయికిరణ్, మోహన్‌రావు, పుష్ప, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది పుండలీక్, ఏఎస్‌రావు పాల్గొన్నారు.

‘ఆత్రం’ గెలుపుకోసం కృషి చేయాలి

కుంటాల: ఆదిలాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కు గెలుపుకోసం కృషి చేయాలని పార్టీ ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యురాలు పడకంటి రమాదేవి అన్నారు. శనివారం కుంటాలలో ఏర్పాటు చేసిన పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడారు. పార్టీ సిద్ధాంతాలకు ప్రతిఒక్కరూ కట్టుబడి ఉండాలన్నారు. బీఆర్ఎస్ మండల కన్వీనర్. పడకంటి దత్తాద్రి, జిల్లా సోషల్ మీడియా ఇన్‌చార్జి పెంటవార్ దశరథ్, మైనార్టీ మండల కన్వీనర్ ఖదీర్ పాల్గొన్నారు.

పరామర్శ

కుంటాల: మండలంలోని దౌనెల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త సయ్యద్ అలీం తల్లి మొరం బీ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా శనివారం బాధిత కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ నాయకురాలు పడకంటి రమాదేవి పరామర్శించారు. ఆమె వెంట మాజీ సర్పంచ్ ఎండీ హైమద్, తదితరులు ఉన్నారు.

మహిళల రక్షణే షీటీమ్ ముఖ్య ఉద్దేశం



అవగాహన కల్పిస్తున్న రమాదేవి

సారంగపూర్: మహిళలకు రక్షణ కల్పించడమే షీటీమ్ ముఖ్య ఉద్దేశమని షీటీమ్ పీసీ రమాదేవి అన్నారు. మండలంలోని చించోలి(బి) ఉన్నత పాఠశాలలో శనివారం షీటీమ్ ఆధ్వర్యంలో మహిళల రక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు ఆపద సమయంలో షీటీమ్ నంబర్ 8712659550, లేదా డయల్ 100 కు ఫోన్ చేసి సమాచారమిస్తే తప్పకుండా రక్షణ కల్పిస్తామన్నారు. విద్యార్థులు చిన్నతనం నుంచే ఆత్మరక్షణ విద్యను నేర్చుకుంటే భవిష్యత్తులో తమను తాము రక్షించుకోవడంతో పాటు తోటి వ్యక్తులను రక్షించే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో మధుసూదన్, ఉపాధ్యాయులు రమేశ్, సాయన్న, సునీత, అన్నపూర్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఆహ్వానపత్రాలు అందజేత


చైర్మన్‌ను ఆహ్వానిస్తున్న ఆలయకమిటీ సభ్యులు

ఖానాపూర్: ఈ నెల 17న పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీ హన్మాన్ మందిర్‌లో జరిగే శ్రీరామనవమి ఉత్సవాలకు రావాలని కోరుతూ ఆలయకమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యంతో పాటు పలువురు ప్రముఖులు, నాయకులు, అధికారులకు ఆహ్వానపత్రాలు అందజేశారు. అంతకముందు స్వామివారి కల్యాణోత్సవానికి కాలనీకి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు పాలెపు సుదర్శన్ రూ.5వేలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయకమిటీ సభ్యులు గంగాధర్, అయిందాల జనార్దన్, శ్యామ్, టీ.కిషన్, పాదం రాకేష్, డబ్బ శ్రీనివాస్, జీ.రవి, తదితరులు పాల్గొన్నారు.

‘విజేత’ వార్షికోత్సవం


నృత్యం చేస్తున్న విద్యార్థులు

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్‌లో విజేత పాఠశాల వార్షికోత్సవం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు చూపరులను అలరించాయి. కార్యక్రమంలో కరస్పాండెంట్ మదిరె శ్రీనివాస్, ప్రిన్సిపాల్ కృష్ణవేణి, న్యాయవాది వెంకట్ మహేంద్ర పాల్గొన్నారు.

సాగునీరు పరిశీలన

ఖానాపూర్: ఎస్సారెస్పీ నుంచి సదర్‌మాట్ ఆయకట్టుకు విడుదలైన నీటిని శనివారం కాంగ్రెస్ నాయకులు దయానంద్, నిమ్మల రమేశ్ లక్ష్మణచాంద మండలం వడ్యాల్ వద్ద పరిశీలించారు. ఆదివారం సాయంత్ర వరకు నీరు అందుతుందని, రైతులు ఆందోళన చెందవద్దన్నారు. పరిశీలించిన వారిలో నాయకులు తోట సత్యం, లక్ష్మీపతిగౌడ్, గొర్రె గంగాధర్, తదితరులు ఉన్నారు.

పరామర్శ


మామడ: మండలంలోని పొన్కల్ గ్రామానికి చెందిన అట్ల రాజారెడ్డి, చెరుకు చిన్న రాజన్న కుటుంబ సభ్యులను శనివారం డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు పరామర్శించారు. ఆయన వెంట మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ఏనుగు లింగారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, శేఖర్, లింగన్న, భూమేశ్వర్, మనోహర్, తదితరులు ఉన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం


అన్నదానం నిర్వహిస్తున్న రాజ్‌కుమార్‌రెడ్డి

సారంగపూర్: జిల్లా కేంద్రంలోని డవ్ వృద్ధాశ్రమంలో బోరిగాం గ్రామానికి చెందిన చిన్నోళ్ల రాజ్‌కుమార్‌రెడ్డి తల్లి లస్మవ్వ వర్ధంతి సందర్భంగా శనివారం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అతని కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన హరిహర వారోత్సవాలు


కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

పెంబి: మండల కేంద్రంలో మూడు రోజులుగా కొనసాగుతున్న శ్రీ హరిహర వారోత్సవాలు ముగిశాయి. శనివారం హరిహర కల్యాణ మహోత్సవాన్ని వేద పండితులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ఆదిలాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు.

ఆదిలాబాద్‌కు తరలిన కార్యకర్తలు

లోకేశ్వరం: మండలంలోని ధర్మోర, పంచగుడి, వట్టోలి, రాయపూర్‌కాండ్లీ, లోకేశ్వరం, కిష్టాపూర్, అబ్దుల్లాపూర్, మన్మద్, సాథ్‌గాం, తదితర గ్రామాల్లోని బీజేపీ బూత్ స్థాయి కార్యకర్తలు ఆదిలాబాద్‌లో శనివారం నిర్వహించనున్న సభకు ప్రత్యేక వాహనంలో తరలివెళ్లారు.

అభివృద్ధి పథకాలే గెలిపిస్తాయి


ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

కుంటాల: కేంద్రంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రవేశ పెట్టిన అభివృద్ధి పథకాలే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపిస్తాయని ఆపార్టీ నాయకుడు కుబీర్ రాజన్న అన్నారు. శనివారం మండలంలోని అంబుగామలో ఆదిలాబాద్ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి గోడం నగేష్‌ను గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు జాదవ్ సురేష్, దత్తు, తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలు సాధించాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్

కడెం: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలు సాధించాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణతో కలిసి శనివారం మండలంలోని కొత్తమద్దిపడగలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలకు అంబేడ్కర్ చేసిన కృషి మరువలేనిదన్నారు. ఆ మహనీయుని ఆలోచనలు, సిద్ధాంతాలు పాటించడమే ఆయనకు మనమిచ్చే గౌరవమన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జడ రాజమణి, వైస్ ఎంపీపీ శ్యాం, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సతీశ్‌రెడ్డి, మండలాధ్యక్షుడు మల్లేశ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు శంకర్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు దుర్గాభవాని, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజేశ్‌నాయక్, అంబేడ్కర్ సంఘం నాయకులు ఇందూర్‌నేత, రాజలింగం, రమేశ్, రాజేశ్, గంగన్న, మల్లేశ్, సత్యంచారి, సిద్దూ, వెంకటేశ్, రాజు, భూషన్, సలీం, భూమేశ్, సత్యం, లచ్చన్న, తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించాలి

లక్ష్మణచాంద: మండలంలోని అన్ని గ్రామాల్లో అంబేడ్కర్ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించాలని అంబేడ్కర్ సంఘం నాయకులు జడ్డి శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. అంబేడ్కర్ చేసిన త్యాగాన్ని ప్రజలకు వివరించాలని సూచించారు.

ముస్తాబైన రామలింగేశ్వరస్వామి ఆలయం

- నేటి నుంచి ఈ నెల 19వరకు ఉత్సవాలు


విద్యుత్ కాంతుల్లో రామలింగేశ్వరస్వామి ఆలయం

దస్తురాబాద్: మండలంలోని రేవోజీపేట రామలింగేశ్వరస్వామి ఆలయం ప్రథమ వార్షికోత్సవానికి ముస్తాబైంది. ఈ నెల 14 నుంచి 19 వరకు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 14న విష్ణు సహస్రనామ పారాయణము, విశ్వక్సేన ఆరాధన, వాసుదేవ పుణ్యాహవచనం, రక్షాబంధనం, అంకురార్పణ, 15న చతుస్థానార్చన, వైనతేయ ప్రతిష్ఠ,అగ్నిప్రతిష్ఠ, ధ్వజారోహణం, భేరీపూజ, దేవతా హ్వానం, 16న సంక్షేప రామాయణ హోమం, నిత్యహోమం, బలిహరణం, శేషవాహనసేవ, కుంకుమార్చన, 17న నిత్యహోమం, బలిహరణం, సీతారామచంద్రస్వామి కల్యాణోత్సవం, 18న నిత్యహోమం, బలిహరణం, రుద్రాభిషేకం, రథోత్సవం, 19న మహాపూర్ణాహుతి, చక్రస్నానం, పుష్పయాగం, దేవతోద్వాసనము, ద్వాదశారధన, ఏకాంతసేవ వంటి కార్యక్రమాలు ఆలయ అర్చకులు వంశీధరాచార్యుల బృందంచే నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న సూపర్ వైజర్ నర్సయ్య

నర్సాపూర్(జి): మండలంలోని గొల్లమాడలో శనివారం ఆర్టీసీ నిర్మల్ డిపో ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై సూపర్ వైజర్ ఎల్.నర్సయ్య గ్రామస్తులకు అవగాహన కల్పించారు. నిర్మల్ నుంచి గొల్లమాడకు వచ్చే బస్సుకు జీపీఎస్ సిస్టం ఏర్పాటు చేశామని, బస్సు ఎప్పుడు ఎక్కడ ఉందో తెలుసుకోవచ్చన్నారు. ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్లలో గమ్యం యాప్ డౌన్లోడ్ చేసుకోవాలని సూచించారు. అనంతరం రోడ్డు భద్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు.

కుభీర్: మండల కేంద్రంలోని బస్టాప్‌లో ఆర్టీసీ అధికారులు రోడ్డు భద్రతపై ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ఆర్టీసీలోనే సుఖప్రదమైన ప్రయాణం చేయాలని, గమ్యం యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని బస్సు సమయం, వివరాలు తెలుసుకోవాలన్నారు.

‘గుట్ట’పై ఉత్సవాలు ప్రారంభం


విగ్రహాన్ని ఊరేగిస్తున్న కాలనీవాసులు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని కుర్రన్నపేట్‌లో గల చారిత్రక వేంకటేశ్వరగుట్టపై స్వామి వారి నూతన విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు ధ్వజారోహణం, దేవతామూర్తుల ఊరేగింపు, దేవతల ఆహ్వాన పూజలు, హోమం నిర్వహించారు. హనుమాన్ ఆలయం నుంచి ప్రతిష్ఠాపన విగ్రహాలను గుట్టపై ఉన్న ఆలయం వరకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం పెరుమాండ్ల వంశస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం స్వామివారి విగ్రహ ప్రతిష్ఠాపన నిర్వహించనున్నారు.

ఆహ్లాదం పంచుతున్న రహదారి


మండల కేంద్రం నుంచి కనకాపూర్‌కు వెళ్లే రహదారిపై రోడ్డుకు ఇరువైపులా నాటిన తురాయి మొక్కలు ఏపుగా పెరిగాయి. కేసీయా ఆక్సిడెంటాలిస్ అనే శాస్త్రీయ నామం గల ఈ మొక్కలు ఎర్రని పూలు పూయడంతో రోడ్డు వెంట తివాచీ పరిచినట్లు కనిపిస్తున్నాయి. వాహనదారులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. – లక్ష్మణచాంద

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నిర్మల్
90106 10882
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
నిర్మల్ మరియు ముధోల్ :
జి.గంగాధర్ - 7997958182
టోల్ ఫ్రీ నెం.: 1800 425 9899